సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| శుక్రవారం 17 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 319 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|



## మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లుపై అమిత్ షా కీలక వ్యాఖ్యలు

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 17, ప్రతినిధి: మహిళా రిజర్వేషన్ మరియు డీలిమిటేషన్ అంశాలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం కాకుండా, భారీ లాభం కలుగుతుందని ఆయన స్పష్టం చేశారు. కర్ణాటక, తెలంగాణ వంటి దక్షిణాది రాష్ట్రాలకు ఈ బిల్లు వల్ల ప్రయోజనం ఉంటుందని తెలిపారు. దక్షిణానికి నష్టం జరుగుతుందంటూ విపక్షాలు చేస్తున్న ప్రచారం పూర్తిగా తప్పుడు సమాచారమని ఆయన విమర్శించారు. బిల్లుపై అపోహలు సృష్టిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించిన అమిత్ షా, వాస్తవానికి ఈ సంస్కరణలు సమాన ప్రాతినిధ్యాన్ని పెంచడానికే ఉద్దేశించబడినవని పేర్కొన్నారు. మొత్తం మీద దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరుగుతుందనే విషయాన్ని స్పష్టం చేస్తూ విపక్షాల విమర్శలను ఆయన ఖండించారు.



## ఉన్నత విద్యపై నారా లోకేష్ సమీక్ష – మౌలిక సదుపాయాల బలోపేతంపై దృష్టి

సందేశం టైమ్స్, అమరావతి, ఏప్రిల్ 17, ప్రతినిధి: ఉండవల్లి నివాసంలో ఉన్నత విద్య అధికారులతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమీక్ష నిర్వహించారు. ఉన్నత విద్యా సంస్థల వివరాలతో పాటు సిబ్బంది, విద్యార్థుల ముఖ ఆధారిత గుర్తింపు కోసం ఇప్పటివరకు చేపట్టిన చర్యలపై ఆయన ఆరా తీశారు. అనంతరం పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య ఉన్నతాధికారులతో కూడా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 3 స్టార్ మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అలాగే పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పనులను స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలకు అప్పగించాలని సూచించారు.ఇక రాష్ట్రంలో పరిశ్రమల అంశంపై జరుగుతున్న రాజకీయ ఆరోపణలు, సముద్ర భద్రత, బోట్ల గస్తీ వంటి అంశాలపై కూడా చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టిందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.



## లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ – ప్రియాంక గాంధీ విమర్శలు

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 17, ప్రతినిధి: లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఎవరూ వ్యతిరేకం కాదని, అయితే అసలు సమస్య డీలిమిటేషన్ బిల్లేనని ఆమె పేర్కొన్నారు. బిల్లుకు కాంగ్రెస్ పూర్తి మద్దతు ఇస్తోందని, రాహుల్ గాంధీ స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీని కలిసి మద్దతు తెలిపారని వెల్లడించారు. డీలిమిటేషన్ ప్రక్రియ వెనుక పెద్ద కుట్ర ఉందని ఆరోపించిన ప్రియాంక, దీని వల్ల కొన్ని రాష్ట్రాలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని అన్నారు. ఎన్నికల లబ్ధికోసమే కేంద్రం ఈ బిల్లును తీసుకొస్తోందని విమర్శించారు. డీలిమిటేషన్ అమల్లోకి వస్తే ప్రజాస్వామ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు. కులగణన అంశంపై కూడా కేంద్రాన్ని ప్రశ్నించిన ఆమె, ఓబీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహిళల హక్కుల విషయంలో బీజేపీ తామే చాంపియన్‌లా వ్యవహరిస్తోందని విమర్శిస్తూ, కేంద్రం అన్ని వ్యవస్థలపై ఒత్తిడి తెస్తోందని ప్రియాంక గాంధీ ఆరోపించారు.




## వికసిత్ భారత్ 2047'కు అనుసంధానంగా 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యం – డీప్ టెక్నాలజీపై ప్రత్యేక దృష్టి

సందేశం టైమ్స్, అమరావతి, ఏప్రిల్ 17, ప్రతినిధి: ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన 'వికసిత్ భారత్ 2047' లక్ష్యానికి అనుసంధానంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌ను ముందుకు తీసుకెళ్తోంది. దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 10 సూత్రాలలో 'దైనందిన జీవితంలో డీప్ టెక్నాలజీ వినియోగం'ను కీలక అంశంగా చేర్చింది.ఈ విధానంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కేవలం పరిశ్రమలకే పరిమితం చేయకుండా, సాధారణ ప్రజల రోజువారీ జీవితంలోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, పరిపాలన, రవాణా వంటి అన్ని రంగాల్లో డిజిటల్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ టెక్నాలజీ వంటి ఆధునిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.గ్రామ స్థాయి వరకు డిజిటల్ సేవలను విస్తరించడం, రైతులకు స్మార్ట్ వ్యవసాయ పద్ధతులు అందించడం, విద్యార్థులకు సాంకేతిక ఆధారిత విద్యను అందించడం, వైద్య సేవల్లో వేగవంతమైన డిజిటల్ వ్యవస్థను అమలు చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం.ఈ 'స్వర్ణాంధ్ర 2047' విజన్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

## ఢిల్లీ విమానాశ్రయంలో రెండు విమానాలు ఢీకొన్న ఘటన



సందేశం టైమ్స్, ఢిల్లీ, ఏప్రిల్ 17, ప్రతినిధి: ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రెండు విమానాలు ఢీకొన్న ఘటన చోటుచేసుకుంది. స్పైస్‌జెట్‌కు చెందిన విమానం, ఆకాసా ఎయిర్ విమానాన్ని ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ఘటనలో రెండు విమానాల రెక్కలు దెబ్బతిన్నప్పటికీ, ప్రయాణికులు మరియు సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. ఘటనకు గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

## వడదెబ్బ నివారణకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు – మంత్రి ఆదేశాలు




సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రతినిధి: రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ బాధితులకు తక్షణ చికిత్స అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఆసుపత్రుల్లో తాగునీరు, ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు అందుబాటులో ఉంచాలని సూచించారు. వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఎమర్జెన్సీ విభాగాల్లో ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉండాలని, ఫైర్ సేఫ్టీ చర్యలు కచ్చితంగా పాటించాలని మంత్రి ఆదేశించారు.



## జనాభా ఒక్కటే ప్రమాణం కాదు... లోక్‌సభ సీట్ల పెంపులో అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రతినిధి: లోక్‌సభ సీట్ల పెంపు అవసరం ఉన్నప్పటికీ జనాభా అనే ఒక్క ప్రమాణంతోనే సీట్లను పంచడం దేశ సమాఖ్య వ్యవస్థకు ముప్పుగా మారుతుందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అభిప్రాయపడ్డారు. దేశంలో జనాభా పెరుగుదలతో పాటు సమస్యలు, ప్రాంతీయ అసమానతలు కూడా పెరిగాయని, అందువల్ల ప్రజాస్వామ్యంలో ప్రాతినిధ్యం పెరగడం అవసరమని పేర్కొన్నారు. అయితే సీట్ల పెంపు విషయంలో కేవలం జనాభాను ఆధారంగా తీసుకుంటే గతంలో కుటుంబ నియంత్రణ, మహిళా విద్య, ఆరోగ్యం, అక్షరాస్యత వంటి రంగాల్లో ముందంజలో ఉన్న రాష్ట్రాలు అన్యాయానికి గురవుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాలు సంవత్సరాలుగా వ్యక్తం చేస్తున్న ఆవేదనను గుర్తుచేస్తూ, అభివృద్ధి చేసిన రాష్ట్రాలకు శిక్ష విధించేలా కాకుండా న్యాయం జరిగే విధంగా సీట్ల పంపకం ఉండాలని అన్నారు. కొత్తగా పెంచే సీట్లలో కొంత భాగాన్ని జనాభాకు, మరికొంతను అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యంగా, మిగతా భాగాన్ని మానవ అభివృద్ధి సూచికలు, ఆర్థిక వృద్ధి, అక్షరాస్యత, ఆరోగ్యం, పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ వంటి ప్రమాణాల ఆధారంగా ఇవ్వాలని సూచించారు. లేని పక్షంలో "జనాభా పెంచితే శక్తి పెరుగుతుంది, అభివృద్ధి చేస్తే బలం తగ్గుతుంది" అనే ప్రమాదకర సందేశం దేశానికి వెళ్తుందని హెచ్చరించారు. లోక్‌సభ సీట్ల పెంపు దేశ ప్రయోజనం కోసం జరిగితే అది కేవలం సంఖ్యల పెంపు కాకుండా జాతీయ న్యాయం ప్రతిబింబించేలా ఉండాలని, అభివృద్ధిని గౌరవించే విధంగా కొత్త విధానం తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.




## మానూర్ మండలం లో పంచాయతీ కార్యదర్శుల ఫోరం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

సందేశం టైమ్స్ మనూర్ ఏప్రిల్ 17ప్రతినిధి సంగారెడ్డి జిల్లా మానూర్ మండలంలో పంచాయతీ కార్యదర్శుల ఫోరం నూతన కమిటీ ఎన్నికలు ఘనంగా నిర్వహించబడ్డాయి. నారాయణఖేడ్ టీఎన్‌జీఓ యూనిట్ జనరల్ సెక్రటరీ మిస్కిన్ అధ్యక్షతన, తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ జిల్లా ఫోరం జనరల్ సెక్రటరీ జె.రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో జిల్లా ఫోరం ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ బాలు, పబ్లిసిటీ సెక్రటరీ సుభాష్ తదితరుల సమక్షంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యింది. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన జె.రాజు పర్యవేక్షణలో మండల అధ్యక్షుడిగా నర్మల సంతోష్, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీగా చి.సంతోష్, కోశాధికారిగా ఎం.సంగీత, జాయింట్ సెక్రటరీగా బి.కళావతి, స్పోర్ట్స్ సెక్రటరీగా నాందేవ్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా నరేష్ చారి, శ్రీను రాథోడ్, రాజ్ కుమార్, గణపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం మండల ప్రత్యేక అధికారి రఘుబాబు, ఎంపీడీవో చంద్రశేఖర్ చేతుల మీదుగా టీపీఎస్సీఎఫ్-2026 డైరీ, టీపీఎస్‌డీఎఫ్ సంగారెడ్డి జిల్లా టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ చేయగా, నూతన కమిటీ సభ్యులకు నాయకులు శుభాకాంక్షలు తెలియజేస్తూ సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

## విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి: జైపాల్ నాయక్



సందేశం టైమ్స్, అందోల్, ఏప్రిల్ 17, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న విద్యుత్ ఆర్టిజన్ల సమ్మెకు గురువారం జోగిపేటలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెన్కో, ట్రాన్స్కో, ఎస్పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్ పరిధిలో సుమారు 18 వేల మంది ఆర్టిజన్ కార్మికులు కీలక సేవలు అందిస్తున్నప్పటికీ వారి సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రతను పరిరక్షించడంతో పాటు దీర్ఘకాలంగా పనిచేస్తున్న వారిని శాశ్వత ఉద్యోగులుగా మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ కార్మిక నాయకులు రంజిత్, రాజేందర్ కుమార్, కార్తీక్, జోగినాథ్, కుమ్మరి రాజు, రాములు, జాదావత్ బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.

## బోరపట్లలో అక్రమ కల్లు దుకాణంపై చర్యలు తీసుకోవాలి: కార్మిక సంఘం డిమాండ్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 17, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ముందు కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించి డిప్యూటీ కమిషనర్ హరికిషన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, బోరపట్ల గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు సత్య గౌడ్ మాట్లాడుతూ బోరపట్ల గ్రామంలో గత ఆరు నెలలుగా సొసైటీకి విరుద్ధంగా అక్రమంగా నడుస్తున్న కల్లు దుకాణంపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కొందరు ఎక్సైజ్ అధికారులు అవినీతికి పాల్పడి అక్రమ దుకాణాలను ప్రోత్సహిస్తున్నారని, వారిపై తక్షణ చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న దుకాణాన్ని మూసివేసి స్థానిక కల్లుగీత సొసైటీ సభ్యులకు ఉపాధి కల్పించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణ గౌడ్, రవి గౌడ్, వెంకటేశం గౌడ్ తదితరులతో పాటు గ్రామ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



## సమన్వయంతో పనిచేస్తే గ్రామ సమస్యలకు శాశ్వత పరిష్కారం: స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ

సందేశం టైమ్స్, వట్పల్లి, ఏప్రిల్ 17, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలంలో "ప్రజా పాలన – 99 రోజుల ప్రజా ప్రణాళిక" కార్యక్రమం భాగంగా మండల స్థాయి సమావేశం స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరుతున్నాయా అనే విషయాన్ని సమీక్షించడం కీలకమని, ప్రతి శాఖ తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. గ్రామ సర్పంచులు, సెక్రటరీలు పరస్పర సమన్వయంతో పనిచేస్తే సమస్యలు తలెత్తవని, అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని తెలిపారు. సమావేశంలో హెల్త్, ఇరిగేషన్, వెటర్నరీ, హౌసింగ్, ఉపాధి హామీ, విద్యా శాఖల అధికారులు తమ పనుల వివరాలు తెలియజేయగా, సర్పంచులు ప్రస్తావించిన గ్రామ సమస్యలను నమోదు చేసి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామ్ రెడ్డి, ఎంపీవో ఖాజా మైనుద్దీన్, ఎంఈఓ రంజిత్ కుమార్ తదితర అధికారులు, సర్పంచులు, సెక్రటరీలు మరియు పత్రికా ప్రతినిధులు పాల్గొన్నారు.

## చాక్లెట్ ఆశతో బాలుడికి యాసిడ్ తాగించిన పిన్ని.. ఘట్‌కేసర్‌లో సంచలనం



సందేశం టైమ్స్, ఘట్‌కేసర్, ఏప్రిల్ 17, ప్రతినిధి: కుటుంబ కలహాలు అమానుష ఘటనకు దారి తీసిన సంఘటన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వెలుగుచూసింది. తన కొడుకును చిన్నచూపు చూస్తున్నారనే ఆవేదనతో ఓ మహిళ, తోడికోడలి నాలుగేళ్ల కుమారుడిని లక్ష్యంగా చేసుకుని జ్యూస్ తాగితే చాక్లెట్ ఇస్తానని మోసపూరితంగా చెప్పి యాసిడ్ తాగించినట్లు పోలీసులు తెలిపారు. బాలుడు తీవ్ర అస్వస్థతకు గురవడంతో తల్లిదండ్రులు వెంటనే సమీప ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఈ ఘటనపై బాలుడి తల్లి మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబ విభేదాలు ఇంత దారుణానికి దారి తీసిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది

## అర్బన్ ఫారెస్ట్ పార్క్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డి



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఏప్రిల్ 17, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణ ప్రజల కోసం నిర్మిస్తున్న అర్బన్ ఫారెస్ట్ పార్క్ పనులను నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా పరిశీలించారు. పార్క్ నిర్మాణ పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన వాకింగ్ ట్రాక్, పిల్లల ఆట స్థలాలు, పచ్చదనం పెంపొందించే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెరుగుతున్న కాలుష్యానికి చెక్ పెట్టడంతో పాటు ప్రజలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకర వాతావరణం అందించాలనే లక్ష్యంతో ఈ పార్కును అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో రూపొందుతున్న ఈ పార్క్ పట్టణ ప్రజలకు వ్యాయామం, విశ్రాంతి కోసం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పండరి రెడ్డి, రామచందర్ మాజీ ఎంపీటీసీలు, బాణాపురం రాజు, రుక్మిణి గోపాల్ రెడ్డి, షారుఖాన్, మహేష్ చౌహన్, సుబుర్, మున్సిపల్ కౌన్సిలర్లు గంగారెడ్డి, సంగ్రామ్, మహేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ధృవపత్రాలు కలిగి ఉండాలి




సందేశం టైమ్స్, వట్పల్లి, ఏప్రిల్ 17, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం పరిధిలో ప్రతి వాహనదారుడు రోడ్లపై ప్రయాణించే సమయంలో అవసరమైన ధృవపత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని వట్పల్లి ఎస్సై లవ కుమార్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు తదితర వాహనదారులు ఇన్సూరెన్స్, ఆర్‌సి బుక్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి పత్రాలు వెంట తీసుకెళ్లాలని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాల సమయంలో ప్రాణాలను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. వాహన ప్రమాదాల్లో మరణాలు సంభవించినప్పుడు ఇన్సూరెన్స్ ద్వారా కుటుంబాలకు ఆర్థిక సహాయం లభిస్తుందని, అలాగే ఇతరులకు నష్టం జరిగినా ఇన్సూరెన్స్ ఉపయోగపడుతుందని చెప్పారు. అందువల్ల ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ తీసుకోవాలని ఆయన సూచించారు.

# ప్రజాపాలన కార్యక్రమం ద్వారా అర్హులందరికీ పథకాలు చేరవేయడం ప్రధాన లక్ష్యం: కలెక్టర్ ప్రతిమా సింగ్





సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 17, ప్రతినిధి: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మెదక్ జిల్లా కొల్చారం మండలంలో గురువారం మండల స్థాయి సమావేశం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా హాజరై జయ జయ హే తెలంగాణ రాష్ట్ర గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రతి అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడం ప్రధాన లక్ష్యమని, గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం అందించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మండల సమావేశంలో లేవనెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశిస్తూ ప్రజల నుండి వచ్చిన ప్రతి విజ్ఞప్తిని ప్రాధాన్యంగా పరిగణించి నిర్ణీత కాలంలో పరిష్కారం చూపాలని తెలిపారు. గ్రామ స్థాయిలో తాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర మౌలిక వసతుల సమస్యలను వెంటనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో కనీసం పది మంది రైతులతో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఈ పంట ద్వారా రైతులకు అధిక ఆదాయం లభించే అవకాశాలను వినియోగించుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులకు సాంకేతిక సూచనలు, శిక్షణలు అందిస్తూ ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడంలో ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. మహిళా సంఘాల బలోపేతం, స్వయం ఉపాధి అవకాశాల పెంపుపై మండల సమాఖ్య సభ్యులు వివరించగా, ఇందిరమ్మ లబ్ధిదారులు ప్రభుత్వం అందించిన ఇళ్ల పథకం ద్వారా తమకు స్థిర నివాసం కలగడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసాచారి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ, ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా బేగం, సర్పంచ్ డి.శేఖర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# అల్లాదుర్గం మండలాన్ని నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి: బీజేపీ నాయకుల వినతి




సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 17, ప్రతినిధి: మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలాన్ని నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని బీజేపీ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. టేక్మాల్, శంకరంపేట్, రేగోడు, వట్పల్లి, అల్లాదుర్గం మండలాలను కలిపి కొత్త నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జిన్నా భాస్కర్ రెడ్డి గురువారం కలెక్టరేట్‌లో ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త నియోజకవర్గం ఏర్పాటు ద్వారా ఆ ప్రాంత అభివృద్ధి వేగవంతం అవడంతో పాటు ప్రజలకు మెరుగైన పరిపాలన అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాములు, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల దాడిలో బాలుడు మృతి... 15 రోజులు ప్రాణాలతో పోరాడి కన్నుమూత



సందేశం టైమ్స్, రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 17, ప్రతినిధి: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. మహేష్-సంగీత దంపతుల కుమారుడు ఆదిత్య ఇంటి ముందుకు ఆడుకుంటుండగా ఒక్కసారిగా వీధి కుక్కలు దాడి చేసి బాలుడి కాలుపై తీవ్రంగా గాయపరిచాయి. కుక్కల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో కిందపడిన ఆదిత్య తలకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. గత 15 రోజులుగా ప్రాణాలతో పోరాడిన బాలుడు గురువారం తెల్లవారుజామున 3 గంటల 40 నిమిషాలకు మృతి చెందాడు. తమ కుమారుడిని కాపాడేందుకు సుమారు 10 లక్షల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ప్రాణాలు నిలబెట్టలేకపోయామని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

# కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం... 8 మంది మృతి



సందేశం టైమ్స్, కర్నూలు, ఏప్రిల్ 17, ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం చిలకల డోనా సమీపంలో బుధవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కర్ణాటక నుంచి మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనానికి వెళ్తున్న బొలెరో వాహనం లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బొలెరోలో ప్రయాణిస్తున్న 8 మంది అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ప్రమాద సమయంలో పలువురు తీవ్రంగా గాయపడగా, వారిలో కొందరు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలుస్తోంది. మరో 10 మంది గాయపడగా వారిని ఎమ్మిగనూరు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతులను కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

# ఎయిర్ ఇండియాకు రూ.22 వేల కోట్ల నష్టం – ఆర్థిక సాయం కోసం వాటాదారులపై దృష్టి

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 17, ప్రతినిధి: దేశీయ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ఈ ఏడాది భారీ ఆర్థిక నష్టాలను చవిచూడనున్నట్లు అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే సుమారు రూ.22 వేల కోట్ల నష్టం నమోదైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కంపెనీ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చేందుకు వాటాదారుల నుంచి ఆర్థిక సాయం కోరుతున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఇందుకోసం టాటా గ్రూప్, సింగపూర్ ఎయిర్‌లైన్స్‌ను ఎయిర్ ఇండియా సంప్రదించినట్లు తెలిసింది. విమానయాన రంగంలో పెరుగుతున్న పోటీ, నిర్వహణ వ్యయాల పెరుగుదల వంటి కారణాలు నష్టాలకు ప్రధాన కారణాలుగా విశ్లేషిస్తున్నారు. కంపెనీ ఆర్థిక స్థితిని బలోపేతం చేయడానికి కీలక చర్యలు చేపట్టే అవకాశాలు ఉన్నాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

# మెదక్‌ను జీరో యాక్సిడెంట్ జోన్‌గా తీర్చిదిద్దాలి... రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరి: కలెక్టర్ ప్రతిమా సింగ్





సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 17, ప్రతినిధి: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మెదక్ పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో పోలీస్-రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన "అరైవ్-అలైవ్" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాను జీరో యాక్సిడెంట్ జోన్‌గా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రోడ్డు భద్రత నియమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించకూడదని, ప్రతి వాహనదారుడు సురక్షితంగా గమ్యస్థానానికి చేరేందుకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, సురక్షిత ప్రయాణానికి కంటి చూపు సరిగా ఉండటం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని, అందరూ ట్రాఫిక్ నియమాలను పాటించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ అతివేగం, డ్రంకెన్ డ్రైవింగ్, నిర్లక్ష్యం ప్రమాదాలకు ప్రధాన కారణాలని, ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెల్మెట్ల పంపిణీ, సిగ్నేచర్ క్యాంపెయిన్ నిర్వహించడంతో పాటు వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. సిపిఆర్ ద్వారా ప్రాణరక్షణపై కూడా అవగాహన కల్పించారు. ప్రజలు రోడ్లపై జాగ్రత్తగా ప్రయాణిస్తూ ప్రమాదాలను నివారించేందుకు సహకరించాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, ట్రాన్స్‌పోర్ట్ అధికారి వెంకటస్వామి, డీఎస్పీ ప్రసన్న కుమార్, మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాకు అపూర్వ స్పందన – 35 మందికి ఉద్యోగావకాశాలు





సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 17, ప్రతినిధి: సంగారెడ్డి తారా ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాకు నిరుద్యోగ యువత నుంచి అపూర్వ స్పందన లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ తెలిపారు. కళాశాల టీ.ఎస్.కే.సి., టాస్క్ మరియు ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో కోవలెంట్ లాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఈ జాబ్ మేళా నిర్వహించబడిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి 80 మందికి పైగా నిరుద్యోగ యువత హాజరుకాగా, అందులో 35 మంది ఎంపికైనట్లు వెల్లడించారు. విద్యార్థులకు విద్యతో పాటు ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో వివిధ సంస్థల సహకారంతో ఇటువంటి జాబ్ మేళాలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కళాశాల విద్యార్థులతో పాటు ఇతర నిరుద్యోగులకు కూడా అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రముఖ సంస్థల సహకారంతో ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు జాబ్ మేళాలను కొనసాగిస్తామని తెలిపారు. తెలంగాణలో ప్రముఖ విద్యాసంస్థలలో తారా ప్రభుత్వ కళాశాల ఒకటిగా నిలుస్తూ విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి కృషి చేస్తున్నదని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ అధికారి డాక్టర్ వినోద్, టి.ఎస్.కే.సి కన్వీనర్ డాక్టర్ సుచిత్ర సింగ్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ వాణి, టాస్క్ అధికారులు శ్రీనివాస్, మానస్, కోవలెంట్ లాబొరేటరీస్ ప్రతినిధులు మహేష్ రెడ్డి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# లైసెన్స్ లేకుండా బండి నడపవద్దు – విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన




సందేశం టైమ్స్, కోదాడ, ఏప్రిల్ 17, ప్రతినిధి: కోదాడ పట్టణంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి పాల్గొని విద్యార్థులకు కీలక సూచనలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన ప్రణాళికా ప్రగతి కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతకు సంబంధించిన నియమ నిబంధనలను వివరించారు. విద్యార్థులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని, అలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులకు కూడా జైలు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరించారు. త్రిబుల్ రైడింగ్ చేయవద్దని, వాహనం నడిపే వారు మాత్రమే కాకుండా వెనుక కూర్చునే వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అతివేగంగా వాహనాలు నడపకూడదని, ప్రాణాలను ప్రమాదంలో పడవద్దని చెప్పారు. సెల్ ఫోన్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో పరిచయం లేని వ్యక్తుల లింకులు తెరవకూడదని, విద్యా అవసరాల కోసమే ఫోన్ ఉపయోగించాలని సూచించారు. సైబర్ క్రైమ్ నుంచి దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి పెట్టి తల్లిదండ్రులకు గౌరవం తీసుకురావాలని, ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేయాలని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు డి. మార్కండేయ, ట్రాఫిక్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డీలిమిటేషన్ బిల్లుకు వ్యతిరేకంగా ప్రతులను దహనం చేసిన సీఎం స్టాలిన్



సందేశం టైమ్స్, చెన్నై, ఏప్రిల్ 17, ప్రతినిధి: నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. ఈ నేపథ్యంలో బిల్లు ప్రతులను ఆయన దహనం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. గతంలో తమిళనాడులో హిందీకి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమ జ్వాల దేశవ్యాప్తంగా ప్రభావం చూపిందని, ప్రస్తుతం ఈ బిల్లుకు వ్యతిరేకంగా తాను మరో ఉద్యమాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ నిరసన జ్వాలలు భాజపా అహంకారాన్ని అణచివేస్తాయని ఆయన వ్యాఖ్యానించారు.



# విమర్శల వార్తలపై క్రిమినల్ కేసులు సరికాదు సుప్రీంకోర్టు వ్యాఖ్య

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 17, ప్రతినిధి: ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ వార్తలు రాసిన జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం ఏమాత్రం సరికాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన జర్నలిస్టు అభిషేక్ ఉపాధ్యాయ్ తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తులు జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. విమర్శనాత్మక వార్తలు రాసినందుకు సంబంధిత జర్నలిస్టును అరెస్టు చేయకుండా మధ్యంతర రక్షణను కూడా మంజూరు చేసింది. ప్రజాస్వామ్య దేశాల్లో అభిప్రాయాలను వ్యక్తపరిచే స్వేచ్ఛను గౌరవించాల్సిన అవసరం ఉందని, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) ప్రకారం జర్నలిస్టుల హక్కులు రక్షించబడతాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రెస్ క్లబ్ సభ్యులు



సందేశం టైమ్స్, ఖమ్మం, ఏప్రిల్ 17, ప్రతినిధి: చింతకాని మండల పరిధిలోని నరసింహాపురం గ్రామానికి చెందిన నేటి గద్దర్ రిపోర్టర్ గొర్రెముచ్చు కరుణాకర్ వివాహ వేడుకలు ఖమ్మం నగరంలోని వేదిక ఫంక్షన్ హాల్లో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చింతకాని మండల ప్రెస్ క్లబ్ సభ్యులు కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులు కరుణాకర్, స్వాతిలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు జొన్నలగడ్డ మల్లీశ్వరి, లింగం రాంబాబు, గండరపు రామారావు, అంబటి శాంతయ్య, పిచ్చయ్య, ఎన్నబోయిన సురేందర్, గంటల తిరుమాల చారి, గడ్డం విజయ్, రణధీర్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు వనము చిన్నప్ప, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# ఒక నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణం – రోడ్డు భద్రతపై ఏసీపీ సారంగపాణి హెచ్చరిక

సందేశం టైమ్స్, చింతకాని, ఏప్రిల్ 17, ప్రతినిధి: రోడ్డు మీద వాహనం నడిపేటప్పుడు చేసే చిన్న నిర్లక్ష్యం కూడా నిండు ప్రాణాలను బలిగొనాల్సిన పరిస్థితి తీసుకురాగలదని వైరా ఏసీపీ సారంగపాణి హెచ్చరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన “అర్రైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ క్యాంపెయిన్–2006” కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం మండలంలోని బసాపురం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ ఆవుల నరసింహారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు యాదృచ్ఛికంగా జరగవని, ఎక్కువగా డ్రైవర్ల నిర్లక్ష్యం, అవగాహన లోపం వల్లనే జరుగుతున్నాయని తెలిపారు. ఒక్క క్షణం అజాగ్రత్త ఒక కుటుంబాన్ని జీవితాంతం విషాదంలో ముంచే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. మోటార్ సైకిల్ నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి దాని పట్టీ బిగించుకోవాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, అధిక వేగం వంటి అలవాట్లు ప్రమాదాలకు ప్రధాన కారణాలని వివరించారు. కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, గ్రామీణ ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఆటోలు నడిపే వారు రాత్రివేళల్లో రిఫ్లెక్టర్లు, రేడియం స్టిక్కర్లు వినియోగించాలని సూచించారు. ప్రమాదం జరిగిన తర్వాత బాధపడటం కన్నా ముందే జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని, ప్రతి ఒక్కరూ తమ భద్రతను తామే కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ వెంకట ప్రసాద్, ఎస్సై వీరేందర్, ఏఎస్ఐ సువర్ణ బాబు, ఉప సర్పంచ్ చంద్రకాంత్ నర్సరావు, చింతకాని పోలీస్ సిబ్బంది వెంకటేశ్వర్లు, కిషోర్ తదితరులు పాల్గొనగా, గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై రోడ్డు భద్రతపై అవగాహన పొందారు.

# ర్యాకల్ ఎల్లమ్మ జాతరలో బండ్ల ఊరేగింపు వైభవంగా





సందేశం టైమ్స్, ర్యాకల్, ఏప్రిల్ 17, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం ర్యాకల్ గ్రామంలో శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ జాతరలో భాగంగా బండ్ల ఊరేగింపు సంప్రదాయబద్ధంగా, భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా భక్తులు అలంకరించిన ఎద్దుబండ్లతో పాటు పాదయాత్రగా గ్రామ వీధుల గుండా ఊరేగింపులో పాల్గొని అమ్మవారిని స్మరించుకున్నారు. రంగురంగుల పూలు, కొబ్బరికాయలు, పూజా సామగ్రితో బండ్లను అలంకరించి డప్పులు, బాజాలు, భక్తి గీతాల మధ్య ఉత్సాహంగా ప్రదర్శన నిర్వహించారు. మొక్కులు తీర్చుకునేందుకు వేలాది మంది భక్తులు హాజరై అమ్మవారి దర్శనం చేసుకోగా గ్రామం మొత్తం పండుగ వాతావరణంలో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో పూజారి శ్రీనివాస్ గౌడ్, రమేష్ గౌడ్, యశ్వంత్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, లింగం గౌడ్, ఎల్లా గౌడ్, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రాథమిక ఆరోగ్య సేవలపై ఉన్నతాధికారుల సమీక్ష

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 17, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ రూరల్ హెల్త్ సర్వీసెస్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ రాష్ట్ర అధికారుల పర్యవేక్షణలో జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అందోల్ మండలం తలవెల్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఓపీ రిజిస్టర్ పరిశీలనతో పాటు మెడికల్ ఆఫీసర్, సిబ్బందితో సమావేశమై ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఔషధాలు, అవసరమైన సరఫరాల లభ్యతను పరిశీలించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్లతో సమావేశమై జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. క్రమం తప్పకుండా సమీక్షలు చేపట్టి అన్ని కార్యక్రమాలు ప్రజలకు చేరేలా కృషి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎం. వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా. సుజాత, పీఓ ఎంసీహెచ్ డా. నాగేంద్ర, పీఓ డీటిటి డా. శంకర్, డీటీసీఓ డా. అనితకుమారి, డీఎంఓ డా. ప్రవీణ్ కుమార్, డీఎస్ఓ డా. వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ప్రజాపాలన కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం కీలకం: నిర్మల జయప్రకాశ్ రెడ్డి




సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 17, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని రైతు వేదికలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి ప్రజలు ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు రైతు రుణమాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు తదితర సంక్షేమ పథకాల అమలు వివరాలను వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని, 99 రోజుల యాక్షన్ ప్లాన్‌ను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో రోడ్డు భద్రత, శానిటేషన్, ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన పెంచాలని సర్పంచులకు సూచించారు. అలాగే రేషన్ పంపిణీ, రబీ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ఈజీఎస్ పనులు వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఐసి జిఎం తుల్జా నాయక్, ఎంపీడీవో శ్రీనివాస్, తహసిల్దార్ రవికుమార్, ఎంపీఓ మహేందర్ రెడ్డి తదితరులు, సర్పంచులు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

# అగ్నిమాపక సేవల వారోత్సవాల్లో రక్తదాన శిబిరం విజయవంతం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 17, ప్రతినిధి: అగ్నిమాపక సేవల వారోత్సవాల సందర్భంగా సంగారెడ్డి అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక కేంద్రంలో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటిచెప్పారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యం అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించడం, అగ్నిమాపక సిబ్బంది త్యాగాలను స్మరించుకోవడం అని అధికారులు తెలిపారు. ప్రాణరక్షణలో భాగస్వామ్యం కావాలనే లక్ష్యంతో ఈ రక్తదాన శిబిరం నిర్వహించబడిందని పేర్కొన్నారు. అదనంగా ఎల్పీజీ, విద్యుత్ భద్రత, ధూమపానం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టారు. స్వచ్ఛంద రక్తదానం ప్రాముఖ్యతను అధికారులు వివరించి రక్తదాతలను అభినందించగా, వైద్య బృందం భద్రతా ప్రమాణాలతో రక్త సేకరణ నిర్వహించింది. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ జిల్లా అగ్నిమాపక అధికారి బి. నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.